శిల్పారామానికి ట్రేడ్ మార్క్ గుర్తింపు

కొండాపూర్, జూలై 26 : శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ, మాదాపూర్ ట్రేడ్ మార్క్ గుర్తింపు పొందినట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ మార్క్ చట్టం 1999, u/s 23(2) రూల్ 56(1) ప్రకారం ప్రభుత్వం ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇకపై శిల్పారామం, శిల్పకళా వేదిక, రాక్ హైట్స్, మౌంటెన్ హైట్స్‌లలో నిర్వహించే కార్యక్రమాలను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే బుకింగ్‌లు చేసుకోవాల్సిందిగా తెలిపారు. బుకింగ్‌ల కోసం www.shilparamam.in వెబ్‌సైట్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు. శిల్పారామం, శిల్పకళా వేదికల పేర్లు, లోగోలను ఇతరులు వినియోగించవద్దని, అనుమతి లేకుండా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కొంటారని తెలిపారు.

నేడు రామకృష్ణ మఠంలో విద్యా సదస్సు

చిక్కడపల్లి,జూలై26 : రామకృష్ణ మఠం స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా శనివారం భారత దేశం 'విద్యా విజన్-విద్యావేత్తల పాత్ర' పై జాతీయ స్థాయిలో వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద తెలిపారు. ఈ సదస్సుకు వివిధ విద్యా సంస్థలకు చెందిన వెయ్యి మందికి పైగా ఉపాధ్యాయులు, పలువురు విద్యావేత్తలు హాజరుకానున్నట్లు ఆయన వివరించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ బి.ఎస్.మూర్తి హాజరుకానున్నట్లు తెలిపారు. స్వరోత్సవ వేడుకల్లో విద్యార్థులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు.

మాకు వెయిటేజీ ఇవ్వండి

తెలుగు యూనివర్సిటీ, జూలై 26: టీజీపీఎస్సీ ద్వారా చేపడుతున్న ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల నియామకాల్లో కేవలం కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే వెయిటేజీ మార్క్స్ ఇస్తున్నారని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోయే అవకాశం ఉందని ల్యాబ్‌టెక్నీషియన్లు సత్యం, రాజు, శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నిలోఫర్ దవఖానలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి, డీఎంఈలకు వినతి పత్రాలు అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెం59 ప్రకారం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజీ మార్కులు కలపాలని వారు డిమాండ్ చేశారు.

పాతనగరం మెట్రోకు చిక్కుముళ్లు

ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వం

వ్యయం పెరగడంతో చేతులెత్తేసిన ఎల్అండ్టీ

నిర్మాణ సంస్థను మార్చితే కేంద్రం నుంచి అనుమతి కావాల్సిందే

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): పాతనగర మెట్రో కారిడార్ నిర్మాణానికి స్థానికులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నా, సంస్థాగతంగా ఎన్నో చిక్కుముళ్లు నెలకొన్నాయి. 2011 నాటికే మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులోనే జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా ఫలక్‌నుమా వరకు 15 కి.మీ మెట్రో కారిడార్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమై, కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్నాయి. పీపీపీ విధానంలో ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ మాత్రం నిర్మాణానికి ముందుకు రావడం లేదు. ఇప్పటికే మూడు కారిడార్‌లలో నిర్మించిన మెట్రో మార్గాల నిర్వహణ సంస్థకు భారంగా మారడమే కాకుండా, లాభాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాత నగరం పెండింగ్‌లో ఉన్న 5.5 కి.మీ (ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా) మెట్రో మార్గాన్ని నిర్మించలేమని చేతులెత్తేసింది. ప్రభుత్వం తరపున హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) పలుమార్లు సంప్రదింపులు జరిపినా ఫలితం లేకుండా పోయింది. ముఖ్యంగా నిర్ణీత సమయంలో ప్రాజెక్టు చేపట్టేందుకు రైట్ ఆఫ్ వే ఇవ్వకపోవడం, ఈలోగా సంవత్సరాలు గడిచిపోవడంతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. అదే సమయంలో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ అంటేనే ఎల్ అండ్‌టీకి ఏమాత్రం కనబర్చడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే పాత నగరానికి సంబంధించిన 5.5 కి.మీ మార్గానికి హెచ్ఎంఆర్ కొత్త డీపీఆర్ రూపకల్పనకు శ్రీకారం చుట్టింది.

కేంద్రం ఒప్పుకుంటేనే ..

పాతనగరంలో మెట్రో కారిడార్ నిర్మాణానికి ఎల్ అండ్‌టీ మెట్రో ముందుకు రాకపోవడంతో కొత్తగా డీపీఆర్ రూపొందించి దాని ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త డీపీఆర్‌ను రాష్ట్ర కేబినెట్ ఆమోదించినా, కేంద్ర ప్రభుత్వం ఆమోదించే పరిస్థితి లేదు. ఎందుకంటే పాతనగరంలో నిర్మించే 5.5 కి.మీ మెట్రో మార్గానికి గతంలో కేంద్ర అనుమతులు ఇవ్వడంతో పాటు వయా గ్యాప్ ఫండ్(వీజీఎఫ్)ను మంజూరు చేసింది. ఏదేమైనా ఆ ప్రాజెక్టును ఎల్అండ్‌టీతో పూర్తి చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్ఎంఆర్‌పై ఉంది. ప్రస్తుతం హెచ్ఎంఆర్ రూపొందిస్తున్న పాతనగరం మెట్రో డీపీఆర్‌ను అంత సులువుగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించే పరిస్థితి లేదని ప్రాజెక్టు నిపుణులు పేర్కొంటున్నారు. కొత్త డీపీఆర్‌ను కేంద్రం ముందుకు తీసుకువెళితే... పాత నగరం మెట్రో మార్గాన్ని ఎల్ అండ్ టీ ఎందుకు పూర్తి చేయలేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంది. వాళ్ల నుంచి ఏమైనా రికవరీ చేయాల్సి ఉందా? ఇంత కాలం ఎందుకు జాప్యం జరిగింది... 2011లోనే అనుమతులు వచ్చిన మొదటి దశ మెట్రోను 2017 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా, ఎందుకు ఆలస్యమైంది అని అడిగే పరిస్థితి ఉంది. వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం సంతృప్తికరమైన సమాధానాలు ఇస్తేనే పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు ముందుకు కదిలే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

9-10 నెలలు గడిస్తే కానీ..

పాత నగరంలో మెట్రో కారిడార్ నిర్మించే అలైన్‌మెంట్ ప్రకారం మెట్రో ప్రాజెక్టును చేపట్టాలంటే 1000కి పైగా ఆస్తులను సేకరిస్తే గానీ మెట్రోకు రైట్ ఆఫ్ వే దొరకదు. ఈ మార్గంలో ఆస్తుల సేకరణకే రూ.600-రూ.800 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా. దీనికి తోడు పాతబస్తీ అంటే చాలా రకాల మౌలిక వసతులు మెట్రో కారిడార్ వెళ్లే మార్గంలో ఉంటాయి. వీటన్నింటినీ మరో చోటుకు తరలించాల్సి ఉంటుంది. ఇలా ఎన్నో అంశాలు పాత నగరంలో మెట్రో మార్గంతో ముడిపడి ఉన్నాయి. రెండో దశలో ప్రతిపాదించిన మార్గాలకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, పాతనగరానికి సంబంధించిన 5.5 కి.మీ మెట్రో కారిడార్ నిర్మాణానికి చాలా చిక్కుముళ్లు ఉన్నాయని, వాటన్నంటినీ పరిష్కరించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలు జరగాలి. అదే సమయంలో ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. శుక్రవారం రాచకొండ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రెండో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సీపీ మాట్లాడుతూ.. సొసైటీలోని సభ్యులు తమ అకౌంట్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా కొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ ఏడాది అమలు చేయాల్సిన పలు నిర్ణయాలు ఈ సమావేశంలో తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు డీసీపీ అడ్మిన్ ఇందిర, సొసైటీ సెక్రటరీ ఎస్సీ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ట్రెజరర్ బాలరాజ్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సెకిటో' పురుగుల మందు విడుదల

జూబ్లీహిల్స్,జూలై26: అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో నూతన క్రిమి సంహార విశిష్ట సస్య రక్షణ ఉత్పాదన 'సెకిటో' పురుగుల మందును శుక్రవారం రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో యూపీఎస్ ఎస్ఎస్ లిమిటెడ్ గ్రూప్ ఇండియా సీఈఓ ఆషిష్ ధోబాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈఓ ఆషిష్ మాట్లాడుతూ అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు సాధించిన నాణ్యమైన సస్యరక్షణ ఉత్పాదనలు అందజేయడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆహార పరిరక్షణకు కావాల్సిన సస్యరక్షణ మందులను టెక్నికల్ గ్రేడ్‌లతో తయారుచేసి రైతుల అవసరాలకు తగిన విధంగా ఫార్ములేషన్‌లను అందజేసే ప్రముఖ బ్రాండ్‌గా నిలిచిందన్నారు. ఇండియా మార్కెటింగ్ హెడ్ ప్రతాప్ రాంకంభ్, సౌత్ ఈస్ట్ బిజినెస్ హెడ్ జగదీశ్, ఫీల్డ్ మార్కెటింగ్ హెడ్ సౌత్ సంగమేశ్వర్, రాష్ట్ర బిజినెస్ హెడ్‌లు బ్ర హ్మారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, శేఖరప్ప, రాజశేఖర్, దక్షిణ ప్రాంత కంపెనీ ప్రతినిధులు పా ల్గొన్నారు.

నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి దాశరథి

దాశరథి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న నందిని సిధారెడ్డి, డా.నామోజు బాలాచారి

రవీంద్రభారతి,జూలై 26: నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతూ తన ప్రాణాలను ఫణంగా పెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యను మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు చాలా మంది గుర్తించలేదని, ఆయన రాసిన నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే మాట ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో బలంగా పనిచేసిందని సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథి సాహిత్య సమాలోచన పేరుతో వివిధ విశ్వవిద్యాలయాల్లో సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నది . శుక్రవారం సినీగేయ కవిగా దాశరథి అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నందిని సిధారెడ్డి మాట్లాడుతూ అన్నా చెల్లెళ్లపైన, భక్తిపైన ఇలా పలు అంశాలపై దాశరథి సినిమా పాటలు సమగ్ర గ్రంథాన్ని సాహిత్య అకాడమీ ముద్రిస్తే బాగుటుందన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి మాట్లాడుతూ దాశరథి సాహిత్యం విద్యార్థుల్లోకి వెళ్లాలనే లక్ష్యంతోనే విశ్వవిద్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆచార్య భుజంగరెడ్డి, ఆచార్య కాశీం, ఆచార్య సూర్య ధనుంజయ్, డా.విజయలక్ష్మి,డా.ఎస్.రఘు తదితరులు పాల్గొన్నారు.

మలేసియాలో ఏసియన్ సమ్మిట్

మలేసియా ఇండియన్ హై కమిషనర్ బీఎన్‌రెడ్డితో సమావేశమైన వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ చైర్మన్ సందీప్ మక్తల

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ మలేసియాలో ఏసియన్ సమ్మిట్‌ను నిర్వహించనుందని సంస్థ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తల తెలిపారు. సమ్మిట్ నిర్వహించాలని అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఏసియన్ నేషన్స్‌లో సభ్య దేశాల నుంచి ఆహ్వానం వచ్చిందన్నారు. తెలుగు స్టార్టప్‌లను ప్రపంచవ్యాప్తంగా విస్తరించే క్రమంలో డబ్ల్యూటీఐటీసీ దేశ,విదేశాల్లో సంప్రదింపులు చేస్తోంది. అందులో భాగంగా ఏసియన్ దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఈ సమ్మిట్ వేదిక అవుతుందన్నారు. దీనికి సంబంధించి మలేసియా ఇండియన్ హై కమిషనర్ బీఎన్‌రెడ్డితో సమావేశమయ్యామని ఆయన తెలిపారు. వివిధ దేశాల్లో తెలుగు ఐటీ రంగ నిపుణులకు అవకాశాలను కల్పించడంతో పాటు పెట్టుబడులను రాబట్టడంలో సంస్థ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని సందీప్ మక్తల వివరించారు.

జీహెచ్ఎంసీకి రూ.3,065 కోట్ల కేటాయింపుపై హర్షం

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ.3,065 కోట్ల కేటాయింపుపై శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ పటాకులు కాల్చి, మిఠాయిలు పంచి సంతోషం వ్యక్తం చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకి కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

ఘట్‌కేసర్/బడంగ్‌పేట, జూలై 26: కుక్కల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని సీడీఎంఏ కమిషనర్ గౌతమ్ అన్నారు. బ్లూక్రాస్ ప్రతినిధి అమలతో శుక్రవారం ఘట్‌కేసర్‌లో చైర్‌పర్సన్, మున్సిపాలిటీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కుక్కలను సంరక్షించే విధానాలను మున్సిపాలిటీ అధికారులు తెలుసుకోవాలని సూచించారు. చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 200 ల కుక్కలకు బ్లూక్రాస్ సౌజన్యంతో స్టెరిలైజ్ చేశామన్నారు. అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేట్, బ్లూ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో తొమ్మిది మంది కమిషనర్లతో సీడీఎంఏ గౌతమ్, ఏడీఎంఏ శ్యామ్‌సన్, బ్లూ క్రాస్ సంస్థ చైర్మన్ అక్కినేని అమల తదితరులతో కలిసి బృందం సందర్శించామని తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్రామ్ తెలిపారు. వీధి కుక్కల సమస్యను తగ్గించడానికి సమర్థవంతమైన వ్యూహాలను రూపొందించాలని సీడీఎంఏ గౌతమ్ ఆదేశాలు జారీచేశారన్నారు. కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

అభివాదం చేస్తున్న ఆర్ కృష్ణయ్య,గుజ్జ కృష్ణ,భరత్‌కుమార్,సత్యం తదితరులు

కాచిగూడ,జూలై 26: నరేంద్రమోదీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలపై కపట ప్రేమ చూపించాడని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఎద్దేవా చేశారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ,యువజన అధ్యక్షుడు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో వివిధ సంఘాల బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ విదేశీయులకు రూ.3,783 కోట్లు కేటాయిస్తే, బీసీలకు రూ.2,300 కోట్లు కేటాయించి, 80 కోట్ల మంది బీసీల మనోభావాలను దెబ్బతీశాడని ఇది బీసీల వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ సత్యం, ఎర్ర సత్యనారాయణ, మల్లేశ్ యాదవ్, నందగోపాల్, సతీశ్, రఘుపతి, రాజన్, జోషి, కుమార్,జయంతి,రమేశ్, కరుణశ్రీ పాల్గొన్నారు.

మూడు నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత

సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 26 : మూడు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలో శుక్రవారం మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ అమలు కానీ హామీలతో కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం పోయిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విఫలమయ్యారన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం అందించినప్పుడే నిజమైన సంక్షేమం అని అన్నారు. ప్రజల్లో ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు అవకాశాలు ఉంటాయని అన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో పోరాడిన సైనికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తిరుమల్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ది శ్రీనివాస్, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి,సుదర్శన్‌రెడ్డి, నరసింహులు, మహేశ్ యాదవ్, రవీందర్ గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి,కృష్ణ యాదవ్, బాలరాజ్ యాదవ్, నరేందర్‌గౌడ్, నరసింహరెడ్డి, వేణు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'అయామ్ వాట్ అయామ్' పుస్తకావిష్కరణ

'అయామ్ వాట్ అయామ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

అమీర్‌పేట్, జూలై 26 : జీవితంలో ఎదురయ్యే ఊహించని ఘటనలతో కుంగిపోకుండా, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ఎవరికి వారు ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్, సెక్స్ క్రైమ్ బాధితుల పక్షాన దశాబ్దాలుగా పోరాటాలు చేస్తూ వారికి అండగా నిలిచిన వీరవనిత ప్రజ్వల సంస్థ సహ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ సునీతా కృష్ణన్ అంటూ ప్రశంసించారు. తన జీవితంలో ఎదురైన ఘటనలు, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలదొక్కుకున్న తీరు, హ్యూమన్ ట్రాఫికింగ్, సెక్స్ క్రైమ్‌లపై ఆమె జాతీయ ,అంతర్జాతీయ స్థాయిలో చేసిన పోరాటాలను ఆవిష్కరిస్తూ తన ఆటోబయోగ్రఫీని 'అయామ్ వాట్ అయామ్' పేరుతో సునీతా కృష్ణన్ చేసిన పుస్తక రచన ఎంతో అమూల్యమైనదన్నారు. శుక్రవారం సాయంత్రం హోటల్ గ్రీన్‌పార్క్‌లో ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెనిఫర్ లార్సెన్, ఐపీఎస్ అధికారి అమిత్ గార్గ్, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బాలాంబ, విఘ్నేష్ కృష్ణన్ తదితరులతో కలిసి సీతక్క ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు డీజీ మహేశ్ భగవత్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మిన్నీ మ్యాథ్యూస్, ప్రముఖ గాయనీ సునీత, సీనియర్ జర్నలిస్ట్ స్వప్న, న్యాయవాది ఎల్.రవిచందర్ పాల్గొని పుస్తకంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

చేపపిల్లల వదిలివేతకు టెండర్లు

గత సంవత్సరం చెరువుల్లో చేపపిల్లలను వదులుతున్న దృశ్యం (ఫైల్)

మేడ్చల్, జూలై26(నమస్తే తెలంగాణ): చేపపిల్లల వదిలివేతకు ప్రభుత్వం ఎట్టకేలకు టెండర్లను ఆహ్వానించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో చేపపిల్లలను పెంచేందుకు అనువుగా ఉన్న 232 చెరువుల్లో చేపపిల్లల వదిలివేతకు ప్రణాళికను ఖరారు చేసింది. వందశాతం సబ్సిడీపై మత్స్యశాఖ 63 లక్షల చేపపిల్లలను టెండర్ల పూర్తి అనంతరం చెరువుల్లో వదిలివేయనున్నారు. చెరువుల్లో చేపపిల్లల వదిలివేతకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మే, జూన్ నెలలోనే టెండర్లను పూర్తి చేసేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్ల ఖరారులో ఆలస్యం చేసిన క్రమంలో మత్స్యకార్మికులు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు టెండర్ల ఖరారుతో మత్స్యకార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆగస్టు 2న టెండర్లు ..

చెరువుల్లో చేపపిల్లల వదిలివేతకు ఆగస్టు 2 న టెండర్లను ఓపెన్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం టెండర్లలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్ నెల చివరి వరకు చెరువుల్లో చేపపిల్లలను వదిలివేత కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకార్మికులు ఆర్థికాభివృద్ధికి చేపట్టిన చేపపిల్లల వదిలివేత కార్యక్రమం విజయంతంగా నిర్వహించిన నేపథ్యంలో మత్స్యకార్మికులు ఆర్థికాభివృద్ధి సాధిస్తూ వచ్చారు.

అణచివేతతో బీసీల వెనుకబాటు

మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

ఖైరతాబాద్, జూలై 26 : దేశంలో మొదటి నుంచే అగ్రవర్ణాల ఆదిపత్యం కొనసాగుతుందని, వెనుకబడిన తరగతుల వారిని అణచివేయడం వల్లే వారు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురయ్యారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. రిజర్వేషన్ డే సందర్భంగా శుక్రవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కులగణన-స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు'అనే అంశంపై ప్రజా తెలంగాణ అధ్యక్షుడు దేవల్ల సమ్మయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. చిరంజీవులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే బీసీలకు రిజర్వేషన్లు ఉండేవని, 1947 తర్వాత ఎస్సీ వర్గాలకు, 1950లో ఎస్టీలకు వచ్చిందని, కాని ఓబీసీలకు రాలేదని, అందు కోసం ఉద్యమం చేయాల్సి వచ్చిందన్నారు. జనాభా ప్రాతిపదికన ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయించకపోవడం వల్ల విద్యా, ఉద్యోగాల్లో నష్టపోయారన్నారు. రాజకీయంగా ఓబీసీ, బీసీలకు రిజర్వేషన్లు లేవని, పార్లమెంట్ పరిధిలో 90 మంది ఐఏఎస్ అధికారులు ఉంటే కేవలం ముగ్గురు మాత్రమే ఓబీసీలు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల విషయం తీసుకుంటే 40 లక్షల ఉద్యోగాల్లో 30 లక్షలు భర్తీ చేయగా, 27 శాతం ఇవ్వాల్సి ఉండగా, కేవలం 23 శాతం మాత్రమే దక్కాయన్నారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఏడున్నర శాతం, ఓబీసీలు నాలుగు శాతం వెనుకబడి ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి, సీనియర్ జర్నలిస్టు దుర్గం రవీందర్, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.